# కటింగ్ చేయించి చూడు

"వా...."

ఇంటికప్పు లేచిపోయేలా బుజ్జిపండు ఏడవసాగాడు.

వాడి ఏడుపుకి హాల్లో కూర్చుని న్యూస్‌పేపర్ చదువుతున్న సుంద రావు కంగారుగా లోపలికి పరుగెత్తుకు వచ్చాడు.

"ఏమైందిరా...." అని అడిగాడు.

"కింద పడ్డాను....వా...." అంటూ ఏడ్చాడు మూడేళ్ళ బుజ్జిపండు.

"నీ శుభ్రం మండిపెట్టా....మాటిమాటికీ ఇంటిని సబ్బుతో కడుగు తావ్ చూశావా ఎట్టా జారిపడిపోతున్నాడో....ఎప్పుడో నేనుకూడా జారి పడి నడ్డిరక్కొట్టుకుని సంసారానికి పనికిరాకుండా పోతాను....అప్పుడు తిక్కొదిలిపోతుంది...." భార్య మంగతాయారు మీద మండిపడ్డాడు సుంద రావు.

"ఊర్కో ఎందుకలా చిందులు తొక్కుతారు?.... వాడేం కాలు జారి పడలేదు....కళ్ళు కనబడక కుర్చీని తన్నేసి పడ్డాడు...." అంది మంగతాయారు చికాకుగా.

"హయ్యో....కళ్ళు కనబడట్లేదా?....ఇంత చిన్న వయసులోనే దృష్టిలోపమా? అయితే వెంటనే కళ్ళ డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాల్సిందే! ....కంగారుపడ్తూ అన్నాడు సుందరావు.

"కళ్ళ డాక్టరు దగ్గరకు వాడినికాదు. మిమ్మల్ని తీస్కెళ్ళాలి.... వాడి మొహమేమైనా కనిపిస్తుందా అసలు?" వాడి జుట్టు చూడండి ఎలా పెరిగిపోయిందో? జుట్టంతా కళ్ళమీదికి వచ్చేసి....వాడికి కటింగ్ ఎప్పుడు చేస్తారు?"

"ఇన్ని సంవత్సరాలు నేనే చేశాను....ఇప్పుడు కూడా చెయ్యా

లంటే ఎలా?....ఇప్పటికైనా షాపులో చేయించడం అలవాటు చెయ్యకపోతే మీసాలు గడ్డాలు వచ్చేదాకా వీడికి నేనే కటింగ్ చేయాలి!.... అప్పుడు కటింగ్‌తోబాటు షేవ్‌కూడా చేయాలో ఏంటో ఖర్మ...." నెత్తిన కొట్టుకున్నాడు సుందర్రావు.

"వాడు షాపుకెలాగూ రాడని మిమ్మల్ని చెయ్యమన్నాను. వాడు మీ కూడా షాపుకొస్తానంటే నాకేంటి అభ్యంతరం...."

"ఒరే పండూ.... చెప్పులేస్కో....కటింగ్ చేయించుకోడానికి షాపుకెళ్దాం" అన్నాడు సుందర్రావు.

"ఊ....నేను షాపుకి రాను....నువ్వే క్రాపు చెయ్...." మారాం చేశాడు బుజ్జిపండు.

"నేను ఇంక చెయ్యకూడదమ్మా....మరేమో నువ్వు పెద్దాడివైపోయావు కదా....నువ్వు షాపులోనే క్రాపు చేయించుకోవాలి....తెలిసిందా?"

"ఊహు...."

"మా బాబువికదూ?....నువ్వు క్రాపు చేయించుకుంటే చాకెట్లు కొనిపెడతా ఆశపెట్టాడు సుందర్రావు...."

"ముందు కొనిపెట్టు... అప్పుడు చేయించుకుంటా"

"అలాగే... చెప్పులేస్కో పెళ్దాం...."

బుజ్జిపండు చెప్పులేస్కొని బయటికి బయల్దేరాడు. సుందర్రావు వాడికి దార్లో ఒక షాపులో చాకెట్లు కొనిపెట్టాడు.

మరికాస్త దూరం నడిచాక సెలూన్ వచ్చింది. దాన్ని చూస్తూనే తక్కున ఆగిపోయాడు బుజ్జిపండు.

"వా...."

హఠాత్తుగా రోడ్డుమీద కూర్చుండిపోయి ఏడవడం మొదలుపెట్టాడు.

సుందర్రావు కంగారుపడిపోయి కిందికి వంగి వాడిని లేపి ఎత్తు

కుని "తప్పమ్మా....అలా కింద కూర్చోకూడదు" అన్నాడు తెలిసిన వాళ్ళెవరైనా చూస్తున్నారేమోనని చుటుపక్కల చూస్తూ.


"నేను ....వా....క్రాపు చేయించుకోను"

ఫెడీల్మని సుందర్రావు మొహంమీద ఒక చరుపు చరిచాడు.

"క్రాపు చేయించుకోవాలి....లేకపోతే పిచ్చాడనుకుంటారు!...."

చంద్రుమన్న మొహం రుద్దుకుంటూ కోపంగా గట్టిగా అరిచాడు.

అతని అరుపుకి దారినపోయే ఒకళ్ళిద్దరు వెనక్కి తిరిగి చూశారు. ఎవరీ పిచ్చాడు అనుకుంటూ.




సుందర్రావు తను అలా అరిచినందుకు తనే సిగ్గుపడిపోయి "తప్పమ్మా....అలా చెయ్యకూడదు....క్రాపు చేయించుకుంటే చాలా చక్కగా ఉంటుందికదా...." మెల్లగా అన్నాడు బుజ్జిపండు చెవిలో.

"షాపులో వాడు చేస్తే చెవి తెగిపోతుంది...." అన్నాడు వాడు బుంగమూతి పెట్టి.

"నీ చెవి తెగకుండా జాగ్రత్తగా చెయ్యమని నేను చెప్తాగా..." బుజ్జగిస్తూ అన్నాడు సుందర్రావు.

"కత్తెర మెడమీద గుచ్చుకుంటుంది...."

"అలా కాకుండా చెయ్యమని నేను చెప్తాగా....వాడు నీ మెడమీద కత్తెర గుచ్చుకునేలా క్రాపు చేస్తే వాడిని పోలీసులకి పట్టించేస్తాను....అట్టాగేనా?...."

బుజ్జిపండు సరేనన్నట్టు తలూపాడు. ఇద్దరూ సెలూన్‌లోకి అడుగు పెట్టారు.

సెలూన్ ఖాళీగాలేదు. ఉన్న మూడు కుర్చీల్లో ఒకడు షేవింగ్ చేయించుకుంటున్నాడు. ఇద్దరేమో క్రాపులు చేయించుకుంటున్నారు.

బుజ్జిపండుని చూడగానే షాపు ఓనర్ రాములు మొహం మాడిపోయింది.

"ఏంది సాబ్....క్రాపు మీకు చెయ్యాలా, లేక ఈ బచ్చాగానికి చెయ్యాలా?" అన్నాడు అనుమానంగా చూస్తూ.

"నాకు మొన్ననే కదోయ్ చేశావ్!....వీడికే చెయ్యాలి!" అన్నాడు సుందర్రావు నవ్వుతూ.

"హాయ్‌రామ్....గీ పోరగాళ్ళకి కటింగ్ చేసుడు చాలా ముసీబత్ సాబ్....మీరు బెంచిమీద గూసోండ్రి" అన్నాడు బాధగా బుజ్జిపండు వంక చూస్తూ.

సుందర్రావు, బుజ్జిపండు బెంచిమీద కూర్చున్నారు. వీళ్ళిద్దరూ కాక మరో ఇద్దరు వ్యక్తులు బెంచిమీద కూర్చుని తమవంతు కోసం ఎదురుచూస్తున్నారు.

బుజ్జిపండు చాక్లెట్లు చప్పరిస్తూ పరిసరాల్ని శ్రద్ధగా గమనిస్తున్నాడు.

కాసేపయ్యాక ఉన్నట్టుండి బుజ్జిపండు పకపకా నవ్వాడు. వాడి నవ్వుచూసి రాములు ముచ్చట పడ్డాడు.

"ఏంది బాబూ అట్టా నవ్వావ్।" అని అడిగాడు.

"మరేమో నువ్వు క్రాపు చేస్తున్నావే....ఆయనకి అంతా బట్ట తలేగా?....నెత్తిన ఉన్న ఆ నాలుగు వెంట్రుకల కోసం కటింగ్‌కి రాకపోతే నేం? హి హి హి...." అన్నాడు బుజ్జిపండు.

ఈ సమాధానానికి రాములు మొహం పాలిపోయింది.

కంగారుగా బట్టతలాయన వంక చూశాడు.

ఆ బట్టతలాయన వెనక్కి తిరిగి గుర్రుగుర్రుమంటూ బుజ్జి పండునీ, సుందర్రావునీ మార్చిమార్చి చూశాడు.

"తప్పమ్మా....అలా అనకూడదు..." సుందర్రావు బుజ్జిపండు చెవిలో మెల్లగా అన్నాడు.

కాసేపయ్యాక బుజ్జిపండు మళ్ళీ కిలాకిలా నవ్వాడు. వాడివంక రాములు భయంగా చూశాడు ఈ సారేమంటాడోనని.

"నాన్నా....ఆ చివర్న క్రాపు చేయించుకుంటున్నాడే, అతని తల కలక్టర్ మావిడికాయలా వుందికదూ? హిహి" అన్నాడు బుజ్జిపండు.

ఆ కలెక్టర్ మావిడికాయ తలున్నాయన పళ్ళు పరపరా నూరాడు.

సుందర్రావుతో బాటు బెంచిమీద కూర్చున్న ఇద్దరూ చరాలున లేచి నిలబడ్డారు.

"హర్రే!.... ఏందట్లా నిలబడింర్రు?.... కూర్చోండి....వీళ్ళ తర్వాత మీకే జేస్త!...." అన్నాడు రాములు.

"వద్దులే....మేం రేపొచ్చి చేయించుకుంటాం...." అని బుజ్జిపండు వంక భయం భయంగా చూస్తూ బయటికి వెళ్ళిపోయారు వాళ్ళిద్దరూ.

రాములు నెత్తికొట్టుకున్నాడు.

కాస్సేపయ్యాక బట్టతలాయనకీ, కలెక్టర్ మావిడికాయ తలాయనకీ క్రాపులు చెయ్యడం అయిపోయింది.

వాళ్ళిద్దరూ బుజ్జిపండువంకా, సుందర్రావువంకా కోపంగా చూస్కుంటూ వెళ్ళిపోయారు.

"రా....రా బాబూ....కూర్చో..." అన్నాడు రాములు సీటు దులుపుతూ బుజ్జిపండుతో.

"నేన్రాను....నేను క్రాపు చేయించుకోను....నువ్వు వేరే ఎవరికైనా చెయ్యి....నేను చూస్తాను...." అన్నాడు బుజ్జిపండు.

"తప్పమ్మా అలా చెయ్‌కూడదు....మరి నీకు చాక్లెట్లు ఇచ్చాగా క్రాపు చేయించుకోమ్మా...." అన్నాడు సుందర్రావు.

"నువ్వు చేయించుకో...."

"నేను మొన్ననేకదా చేయించుకున్నాను....ప్లీజ్ రామ్మా...."

"వద్దు నా చెవి తెగిపోతుంది"

"నేను నీ చెవి తెగకుండా చేస్తా బాబూ...." అన్నాడు రాములు.

"ఉహు....నేను రేపు చేయించుకుంటాను...."

"హర్రే....ఏం ముసీబత్ వచ్చింది బాయ్...." రాములు తలకాయ్ పట్టుకున్నాడు.

సుందర్రావు బుజ్జిపండుకు అవీ ఇవీ కొనిపెడ్తానని ఆశపెట్టి బతిమలాడి కుర్చీలో కూర్చోబెట్టాడు.

రాములు కటింగ్ మొదలు పెట్టగానే బుజ్జిపండు కాళ్ళూ చేతులూ తన్నుకుని గింజుకోడం మొదలుబెట్టాడు.

"హర్రే....ఇస్కీ! గిల్లైయితే చెవుల్, మెడల్ తెగుతాయి సాబ్....బాబుని కదలకుండా పట్టుకోవాలి!" అన్నాడు రాములు.

సుందర్రావు బుజ్జిపండుని కదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. అయినా బుజ్జిపండు గింజుకుంటూ కదుల్తూనే వున్నాడు. సుందర్రావు వాడిని గట్టిగా వాటేసుకుని "ఊ.... నీ పని కానియ్యోయ్...." అన్నాడు.

"అర్రె.... ఎట్లసార్.... మీ తల అడ్డు తగుల్తుంది గదా మల్ల?" అన్నాడు రాములు.

"ఎలాగోలా సందు చూస్కుని క్రాపు చెసేయ్...."

"వా...." గింజుకుంటూ గట్టిగా రాగం తీశాడు బుజ్జిపండు.

ఒక పావుగంట అవస్తపడి బుజ్జిపండుకి క్రాపు చేశాడు రాములు.

ఇంటికెళ్తున్నప్పుడు దారిపొడుగునా రాగం తీస్తూనే ఉన్నాడు బుజ్జిపండు.

ఇంట్లోకిరాగానే మంగతాయారు అడిగింది.

"అదేంటి? అసలు వాడికి క్రాపు వేయించారా అని? జుట్టంతా అలానే వుంది...."

"ఇంకా నయం.... ఈ మాత్రం కట్ చేయించడానికే చచ్చే చావొచ్చిపడింది...."

మంగతయారు సుందర్రావు వంక చూసి మరీ ఆశ్చర్యపోయింది. "అదేంటి మొన్నేగా మీరు క్రాపు చేయించుకున్నారు.... మళ్ళీ ఇప్పుడు మరీ అంత డిప్ప కటింగ్ ఎందుకు చేయించుకున్నారు?"

"నేనేం చేయించుకోలేదు.... వీడిని గట్టిగా వాటేస్కుని పట్టుకుంటే నా తల అడ్డొచ్చి నా జుట్టుకూడా కట్ చేసేశాడు రాములు" ఏడుపు మొహంతో చెప్పాడు సుందర్రావు.